# బ్రతుకు భయం

విశ్వం సోషలిస్టు కాకపోవచ్చు-కానీ కాపిటలిస్టు అనడానికి తగిన కారణం లేదు. రెక్కాడితే కానీ డొక్కాడదు, నెల జీతమే ఆధారం. చెయ్యని వాళ్ళ దగ్గర అప్పులు చేసుకుంటూ, చేసిన అప్పులు కాస్త కాస్త తీర్చుకుంటూ సంసారం ఈడ్చుకొస్తున్నాడు. ఇంటి అద్దె ఇస్తున్నప్పుడు నెల నెలా ఎంత విలవిలలాడతాడో అంతకంటె ఎక్కువ గిలగిల కొట్టుకుంటాడు, ఏటేటా అద్దె రేటు పెరిగిందనగానే. ఈ దోపిడీకి దొరక్కుండ ఉండాలనే తపన విపరీతంగా పెరిగి, ఉన్న కంచం, మంచం, నగ, నట్రా అమ్మకానికి పెట్టి చౌకగా వచ్చిందని ఒక స్థలం ఊరి బయట మారు మూలగా కొనుక్కున్నాడు. ఆవేశంతో చేసే ప్రతి పనిలోనూ కాస్త అవివేకం చోటు చేసుకుంటుంది.

రంగు రంగుల కర పత్రాలు వేయించారు స్థలాలు అమ్మిన వాళ్లు. రమ్యమైన స్వర్గం చిత్రించారు. కట్టబోతున్న రైల్వే స్టేషన్‌కి దగ్గర అన్నారు. పెట్టబోతున్న కొత్త యూనివర్శిటికి ప్రక్కన అన్నారు యాక్టర్లూ, డాక్టర్లూ, ఆఫీసర్లూ అప్పుడే చాలాస్థలాలు కొనుక్కున్నారు. ఆలస్యం చేస్తే ఆశాభంగం అన్నారు. కర పత్రంలో ప్రతి అక్షరాన్ని నమ్మడం పొరపాటని ఒప్పుకోవడానికి ఐదేళ్ళు పట్టింది,

విశ్వానికి పాపం. అరవై ఆరు సందేహాలతో అప్లికేషన్‌ని అటూ ఇటూ తిప్పే ఆఫీసు. అనుకోకుండా ఆశ్చర్యంగా ఐదు నెలల్లో విశ్వంకి లోన్ మంజూరు చేసింది. ఇచ్చిందే తడువుగా ఇల్లు కట్టుకుని ప్రహరీ గోడ లేకుండా, పాస్టరింగు పూర్తి కాకుండా గృహ ప్రవేశం చేసి నిట్టూర్చేడు విశ్వం. ఇప్పుడు ఇంటాయన జులుం, దోపిడీ లేకపోతే పోవచ్చు కానీ ఇరుగు పొరుగుల ప్రసక్తి కూడా లేకుండా ఆ ప్రాంతానికి అతని నివాసం ఒంటరిగా నిల్చిపోయింది. అప్పుడప్పుడు ఎవడో వస్తాడు. 'ఇది నా జాగా' అని అటూ ఇటూ కొలుచుకొని పోయేవాడు తిన్నగా పోక విశ్వం ఇంట్లో కాస్త మంచినీళ్లు త్రాగి "ఆ రాయి వెనకాల స్థలం నాది సార్. కాస్త ఎవరూ గుడిసెలు వెయ్యకుండా మాడండి మీకు పుణ్యం ఉంటుంది" అంటాడు 'మీరు ఇల్లు కట్టుకోరా?' అని అమాయకంగా అడుగుతాడు విశ్వం. 'అబ్బే, లేదండీ, నాకు సిటీలో రెండు ఇళ్లు ఇన్నాయి. ఈ స్థలం రేటు పలుకుతే అమ్ముతాను. ఎవరికైనా కావలిస్తే చెప్పండి" అంటూ వెళ్ళిపోతాడు ఆ వ్యాపారి. ఇలాంటి వ్యక్తుల్ని గత ఐదేళ్ళుగా చూస్తున్న విశ్వం ఒక నిజాన్ని తెలుసుకున్నాడు కాస్త ఆలస్యంగా. తనతో జాగాలు కొన్నవాళ్లు చాలా మంది తనలాంటి వాళ్లు కాదనీ, వాళ్ళ దగ్గర అవసరాలకు మించిన డబ్బు మూలుగుతూ ఉంటే ఊరుకోలేక మునుముందు తనలోటి అభాగ్యుల్ని దోచుకునేందుకు ఈ స్థలాలు కొని పడేసినారని అనుకున్నాడు మనసులో. క్రమంగా విశ్వం, అతని కుటుంబం ఆ వింత ప్రపంచంలో రాజీపడి రోజులు గడుపుతూ ఉంటే ఒక చిన్న సంఘటన వ్యక్తిగతంగా విశ్వాన్ని కుదిపి వేసింది.

ఓ ఆదివారం మధ్యాహ్నం ఎండవేళ ఆలుబిడ్డలు నిశ్చింతగా చాపమీద నిద్రిస్తున్నారు. విశ్వం ఏదో పుస్తకం చదువుకుంటూ కిటికి

లోంచి చూశాడు. ఇంటి ముందు కాస్తంత దూరాన రెండు మిన్నాగులు స్వేచ్ఛా విహారం చేస్తూ కనుపించాయి. ఎండలో కరిగించిన వెండిలా మెరుస్తున్నాయి. సిటిలో ఉన్న తన ఆలు బిడ్డల్ని ఏ రక్షణా లేని ఇలాంటి ప్రదేశంలో తీసుకువచ్చి పడేసినందుకు బాధ పడ్డాడు. భార్యను లేపి ఆ దృశ్యాన్ని చూపించాలనుకున్న వాడు చటుక్కున ఆగిపోయి, ఆ సంఘటన అతని మనసులోనే ఉంచుకున్నాడు. ఆ రాత్రి నిద్రలో మెలుకువ వచ్చింది. కడుపులో ఒక విధమైన కలవరం, మంట ప్రారంభమైంది. తెల్లవారిన వరకు జాగారం చేశాడు. ఇలా ప్రతీ రాత్రీ తట్టి లేపినట్లు మెలకువరావడం, మరి నిద్రరాక పోవడం కడుపులో మంటతో బాధపడడం, ఎవరికీ చెప్పి బాధపెట్టకుండా తన లోని అశాంతిని దాచుకోవడం అతనికి నిత్యవ్రతం అయిపోయింది. డాక్టరుని సంప్రదిస్తే మందులు రాసి ఇచ్చాడు. మనసులో విపరీతమైన అశాంతి, ఆరాటం ఉంటే నివారించుకోవాలి, లేకుంటే అల్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించాడు కూడా. కానీ నివారణోపాయం విశ్వానికి తోచలేదు.

ఇలా రోజులు నెట్టుకుంటూ వస్తూన్న విశ్వం జీవితానికి వింత మలుపు తిప్పే చిన్న విశేషం తటస్థపడింది. ఒక చిన్న సైజు కుటుంబం మధ్యాహ్నం సుమారు రెండు గంటలవేళ తన ఇంటికి కొంతదూరంగా స్థావరం ఏర్పరచుకుంది. భుజం మీద నుండి కావడి దించుకున్నాడు తుప్ప తల నల్లని దేహవర్ణం గల పొడుగాటివాడు. వాడి వెనుకనే ఉంది ఒక స్త్రీ. ఆమె భుజం మీద సుమారు మూడేళ్ళ కుర్రవాడు, చెరుకు ముక్క నముల్తున్నాడు. వీపుమీద వ్రేలాడే గుడ్డ ఉయ్యాలలో పసికందు నిద్రపోతున్నది. సర్కసు వాళ్లు ఫీట్లు చేసినంత నేర్పుతో రెండు వెదురుబద్దలు వంచి మట్టితో పాతి, చాపలు పరచి చిన్న

3537

నివాసం నిర్మించుకున్నారు. ఆ సాయంత్రం ఆ తుప్ప తలవాడు ఎక్కడికో పోయి ఒక గువ్వ పిట్టను తెచ్చుకుని విశ్వం ఇంటి ముంగిట నిలబడి 'దొరా ఒక పుల్ల ఇయ్యవా ని కాలు మొక్కుతా' అన్నాడు. వాడేమి అడుగుతాడో అని కాస్త సందేహించిన విశ్వం అగ్గిపుల్ల అడిగి నట్లు అర్థం చేసుకొని రెండు అగ్గిపుల్లలు వాడి చేతిలో వేశాడు. "ఆ జాగాలో ఏం చేస్తున్నావు. అది మాకు తెలిసిన వకీలుది" అన్నాడు విశ్వం. తుప్ప తలవాడు పక్కుననవ్వి "దేశం మీద తిరిగేటోళ్లం. మా కెందుకు దొరా ఆ జాగ, రేపటికి పోమా" అన్నాడు. ఆ సాయంత్రం పీధి గడపమీదకూర్చొని వాళ్లని చూస్తూ గడిపాడు విశ్వం. మూడు రాళ్లుచేర్చి, ఎండిన పుల్ల, పుడకతోనిప్పు చేసుకొని వండుకు తిన్నారు. తరువాత కొంత సేపు డప్పుమీద దరువు వినిపించింది. ఏదో పదం పాడుకున్నాడు తుప్ప తలవాడు. ఆ రాత్రి ఎప్పటిలాగే విశ్వం నిద్రలోంచి మేల్కొని కిటికీలోంచి చూశాడు. ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా నిద్రిస్తోంది ఆ చిన్న కుటుంబం. అటు చూస్తున్న విశ్వానికి ఏదో వింత సందేశం అందినట్లనిపించింది. వాళ్లకు లేని భయం తనకెక్కడిది? వారిలో ఉన్న ఆత్మవిశ్వాసం తనకెందుకు లేదు? రేపటికి మిగుల్చుకోవాలన్న ఆరాటం లేదు వాళ్లకి. రేపు అన్నది ఎలా ఉదయిస్తే అలా స్వీకరించగల గుండె నిబ్బరం వాళ్లలో వుంది. పోగొట్టుకోగల ఆస్తి లేదు. పోతుందన్న భయంలేదు. ఇంత ఎత్తుగా కట్టుకున్న ఇటికల కొంపలో భయం భయం బ్రతుకు భయం అన్నట్టు తను బిక్కు బిక్కు మనటం విడ్డూరంగా తోచింది.

మర్నాడు ఉదయమే కావడి ఎత్తుకుని ప్రయాణమై పోతున్న వాళ్లని చూసి ఊరుకోలేక మీకు పాములంటే భయంలేదా? అని అడిగాడు

విశ్వం, ఎప్పటిలాగే పక్కున నవ్వి "దొరా, పాములు మీద పడి కరిస్తే, అడవిలో డొంకల్లో మేతమేసుకొనే బర్రెలు గొర్రెలు దినానికి వందలు వందలు చావకుండెనా?" అని ఎదురు ప్రశ్న వేశాడు తుప్పు తలవాడు. నిజానికి ఆ ప్రశ్నలో విశ్వానికి కావలసిన జవాబులేకపోలేదు. "ప్రకృతి నైజం మీద ఎంత గాఢమైన విశ్వాసం ఎంత చక్కటి పరిశీలన?" అని ఆశ్చర్యపోయాడు. విశ్వం గుండెల్లోంచి ఏదో బరువు దింపినట్లయింది. కళ్లు చెమర్చాయి. వాళ్లని కాస్త నిలవమని ఇంట్లోకి పోయి ఒక నిండుగా ఉన్న అగ్గిపెట్టెనూ, తన పిల్లలు వేసుకొనే రెండు చొక్కాలనూ తెచ్చి ఇచ్చాడు. అవి విశ్వం ఎంతో కృతజ్ఞతతో ఇచ్చినట్లు వాళ్ళకేం తెలుసు.

ఆ రాత్రి భోజనంచేసి పడుకున్న విశ్వానికి భార్య నిద్ర లేపిన దాకా తెల్లవారినట్లు తెలియలేదు.

—(రంజని మాస పత్రిక, జనవరి-ఫిబ్రవరి 1983)